# శెట్టి

రచయిత:

శ్రీ ము. కృష్ణమూర్తి పట్నాయక్

★

శెట్టికి కోట్లకొలది ధనధాన్యాలు వున్నై. ఎన్నో యిళ్ళూ వాకిళ్ళూ వున్నై. మందలుగా, పశువులున్నై. ధనంలో, నిజంగా చిన్న కుబేరుడే అతను!

ధనంపై వడ్డీలు వస్తూన్నై. ధాన్యంపై డబ్బువస్తోంది. ఇళ్లూ వాకిళ్ళపై అద్దెలు వస్తోన్నై. పశుగణాలపై గొప్ప రాబడివస్తోంది. పైగా, బేరసారాల్లో ముంచుకొస్తోంది ఎంతో పైకం.

కాని, ఏం లాభం? తను తినడు, ఒకరికి పెట్టడు. పిశినిగొట్టుల్లో మొదటి మనిషి! మెతుకు పోతే బ్రతుకుపోతుందనే బాపతు!

వీటికితోడు పేరాశా, మటుమాయలూ ఒంటపట్టిపోయి యున్నై. గుండె, రాయి అంటే రాయి!

కొట్టుల్లో ధాన్యం వగైరా దాచేశాడు. పైకి రిక్తహస్తాల్లో పెద్దమనిషిలా కనబడసాగాడు.

"బాబుగారూ! చచ్చిపోతూన్నాం, ధాన్యం కాస్త సొమ్మునుతీసుకొనే యిప్పించండి" కాళ్లా వ్రేళ్లాపడి బ్రతిమాలుకుంటున్నారు అభాగ్యులు.

"అన్నా!...చాల కష్టమొచ్చింది! నా దగ్గఱ ఒక్క గింజయినా లేదు. పాపం! ఏం చేస్తాను!" విచారించాడు శెట్టి.

"ఇవ్వకపోతే వీలులేదు. పుణ్యముంటుంది, మీ పేరు చెప్పుకుంటాం."

లేదండోయ్ లేదు! నా కెక్కడిది ధాన్యం మరి? అంతా ఆనాడే అయిపోయింది. పైనుండి తెచ్చినదీ అయిపోయింది. మీకోసమసి నే నెక్కడనుండి తెచ్చేది? పొండి"

"దయతలచండి అయ్యగా !"

"అయితే తరవాత సాయంత్రం రండి చూస్తాను."

మొదట అడుగుతే విచారిస్తాడు. తరువాత అడుగుతే కసురుతాడు. ఇంకోమారు అడుగుతే తరువాత చూస్తాను. రమ్మంటూ మించిపోయే ధరకు చాటుగ-యిస్తాడు. ఇలా కాకపోతే పొరుగూరుకు చీకటిలో చీకటిబజారుకు రవాణా చేసేస్తాడు. అధికారులు వస్తే, దక్షిణ యిచ్చి తన అదుపులో వాళ్ళను వుంచుకుంటాడు. ఇదే పంథా తక్కిన తినుబండారాల విషయాల లోనూ. బట్టలవిషయం మరి చెప్పక్కరే లేదు!

"అయ్యా! ఇంతవడ్డీ యిచ్చుకోలేను దయ యుంచి పిసరు తగ్గించండి."

"ఇష్టముంటే యింత వడ్డీకి అప్పుతీసుకో, లేకుంటే పో. అసలు నా దగ్గఱ సొమ్ముకూడా లేదేమో!"—

"బాబయ్యా! మొత్తం వడ్డీలో కొంత కొట్టండి, బీదవాణ్ణి."

"అణాపైసలతో మొదలుకూడా అక్కడ వుంచవయ్యా!"—

"మరొక నాలుగురోజులు గడువివ్వండి శెట్టిగారూ! మీ అప్పుతీర్చేస్తాను."

"దావా పడేస్తాను, నీ బుర్ర తిరుగుడు అణుగుతుంది!"—

రూపాయకు రెండణాలు వడ్డీ! అంతకు తక్కువకాదు. మొత్తం వడ్డీని అణాపైసలతో

యివ్వాలి. చిల్లి గవ్వకూడా కొట్టడు. సకాలంలో అప్పుతీర్చాలి, లేకపోతే పశుబలంతో గుంజుకుంటాడు.

"ఇల్లు ఖాళీగా వున్నవా శెట్టిగారూ?"

"ఏడాదికి అడ్వాన్సు యివ్వగలవా?"—

"అద్దె ఎక్కువగా వుంది స్వామీ!"

"మీ కని తక్కువకే యిచ్చాను!"

"సొమ్ముకు చాల యిబ్బందిగా వుంది. వచ్చే నెల అద్దె యిస్తాను. దయయుంచండి."

"వెంటనే యిల్లు ఖాళీ చేసేయ్"—

ఏడాది అడ్వాన్సు ముందుగా అందజెయ్యాలి లేకపోతే యింటి ప్రసంగమే ఎత్తకూడదు. కోరినంత అద్దె యివ్వాలి. లేకుంటే ఇల్లు దొరకదు. ఎప్పటికప్పుడూ అద్దెయిచ్చెయ్యాలి. తప్పితే యింటినుండి పోవాలి.

ఇక, పశువుల విషయం చెప్పడం అవసరం! ఊహించుకోవాలి!

తిండికిలేక మాడారు—

బట్టకులేక బాధపడ్డారు—

ఇళ్ళులేక యీసురోమన్నారు

డబ్బులేక దివాలాతీసారు—ఎందరో లెక్కాజమా లేదు! అసలు యమపురికి కూడా యెందరో, వేంచేశారు!

కాని, శెట్టికి యివి కనబడలేదు, వినబడలేదు. ఎరగడు కూడా అతను!

ధనం వుంచడానికి పెట్టెల్లో చోటులేక పోయింది. ఉపాయం ఆలోచించి యింకా కొంత సొమ్ము పెద్దపెద్ద నోట్లుగా మార్చాడు—వెయ్యి రూపాయల నోట్లు, వెయ్యి రూపాయల నోట్లు!

సరి, పెట్టెల్లో ఎంతో చోటు మిగిలింది. ఇంకా ఎంతో సొమ్ము పడుతుంది. పట్టించాలి యెలాగైనా, పట్టించసాగాడు కూడా!

అతని ఆనందానికి అంతులేదు. అతని గర్వానికి అడ్డులేదు. అతనిమాటకు యెదురులేదు!

కాని....

ఒకనాడు ఒకస్నేహితుడు వచ్చి చెప్పాడు- "వెయ్యిరూపాయల నోట్లు చెల్లవటోయ్ కొద్ది రోజులతరువాత, గవర్నమెంటు ఆర్డరువచ్చింది. వెంటనే నీ దగ్గరున్న నోట్లకు చిన్న నోట్లుగా మార్చు, వ్యవధి కాస్త వుంది"

"పోవోయ్, వేళాకోళాలు చేయకు!" అన్నాడు శెట్టి.

మరొకరోజు ఇంకొక స్నేహితుడు అలాగే చెప్పాడు. నమ్మలేదతను. తరువాత బంధువులు చివరకు నౌకరులూ చెప్పారు. కాని, విశ్వసించలేదతను. కాని, అనుమానపడి భయపడ్డాడు.

ఒకనాడు పేపరు చూసాడు. ఈ సంగతంతా నిజమైంది. వణికిపోయాడు. అయినా అప్పటికీ నమ్మడు. కాని, ఏది ఏమైతేనేం వెంటనే నోట్లను మార్చదలచుకున్నాడు. కాని, తను అంత సొమ్ము యెలా సంపాదించాడు? కొరకరాని కొయ్య అయి కూర్చుంది సమస్య! మరీ కంపించిపోయాడు.

చివరకు తెగించాడు. వణుకుతూన్న చేతుల్తో, యాభై నోట్లను పట్టుకొని బయలుదేరాడు.

కొద్దిలో బేంకును చేరుకున్నాడు. కేకేషిరును కలుసుకొని అడిగాడు చిన్ననోట్లను.

కేషీయు ఎగాదిగా చూచాడు అతణ్ణి. "ఏమిటీ చిన్ననోట్లా వెయ్యిరూపాయల నోట్లకు! ఎవరు నువ్వు? ఏ మూలనుండి వస్తూన్నా విప్పుడు? అడిగాడు ఆ కేషీయు.

"ఏం?"

"నోట్లు లేదూ గీట్లూ లేదూ, పోవయ్యా అటు! అప్పుడే గడువుదాటిపోయింది అని మార్చడానికి!"

"ఏయ్, పట్టుకో అతణ్ణి," అరిచాడు యింకొక వుద్యోగి.

"ఎలా సంపాదించావ్ యిన్నినోట్లు?" కేకేశాడు యింకొకడు.

నలుగురూ నాలుగుప్రశ్నలు వేశారు, పెద్ద కోలాహలం పుట్టింది. "ఆ నోట్లు చెల్లవ్, ఆ నోట్లు చెల్లవ్" మార్మ్రోగింది శబ్దం.

శెట్టి బెంబేలు పడిపోయ్యాడు. కళ్లు చీకట్లు కమ్మాయి. భూమి బ్రద్దలైనట్లు తోచింది. వెఱ్ఱిగా చూస్తూ— "హాయ్! యీ నోట్లు—ఒకటి కాదు, రెండుకాదు—వేలకొలది రూపాయలవి—చెల్లవ్? ఆఁ—ఊఁ—అన్నాడు. అంటూనే మొదలు నరికిన చెట్టులా దబ్బున కిందపడిపోయాడు.

నలుగురూ పరుగెత్తుకొనివచ్చి చుట్టు చేరారు. ఎవరికితోచిన ఉపచారాలు వారు చేశారు. కాని—

అతని గుండె పగిలిపోయింది. గ్రుడ్లు రెండూ పెద్దవిచేసి ఒక్క గుక్క గుక్కేసాడు. సరి, యిక—అంతే, అంతా సమాప్తమై పోయింది.

అది అతడికి శిక్షంటారా?



ఒరిజినల్ "వీల్" మార్కు

'చెన్నీస్ వజ్రాలు'

ప్రొప్రైటర్:

చెన్ని రాధాకృష్ణన్

పెద్దబజారు, తిరుచినాపల్లి